# గోదారమ్మ-12

“సీతా.... సీతా...”

గట్టిగా పిలుస్తూ రామచంద్ర అపుడే స్కూలు నుండి వచ్చి లోపలేదో చేస్తున్న సీత దగ్గరకు వచ్చాడు.

సీత సరదాగా అతని వైపు చూస్తూ ‘‘ఏమిటంత హడావుడి... చెప్పండి రామచంద్రా...’’ అంటూ నవ్వింది.

అతను ఇంకా సరదాగా సీతవైపు నవ్వు మొహంతో చూసి ‘‘నువ్వలా నవ్వేసరికి నాకు మైమరపు వచ్చేసింది! ఎందుకు పిలుస్తూ వచ్చానో మరిచేపోయాను సుమా!’’ అన్నాడు.

‘‘అంటే... నవ్వు మానేసి కోపంగా చూడనా... అపుడు గుర్తుకు వస్తుందేమో...!’’ అంటూ సీత కళ్ళు పెద్దవి చేసింది.

‘‘అమ్మో... వద్దు... నవ్వే బావుంటుంది! అయినా గుర్తుకు వచ్చిందిలే... నీకోసం ఎవరో వచ్చారని పెద్దమ్మ తన దగ్గరకు నిన్ను రమ్మనమని చెప్పమన్నారు!’’

‘‘నాకోసం.... ఎవరబ్బా...’’ అంటూ సీత చేతిలో పని ఆపేసి గోదారమ్మ గదిలోకి వచ్చింది. అక్కడ ఆమె పక్కన కూర్చున్న తల్లిని చూసి ‘‘అమ్మా.... నువ్వు ఎపుడు వచ్చావ్...?’’ ఆనందంగా అంటూ మంచం మీద పక్కన కూర్చుంది.

‘‘ఇపుడే’’ అని ఆవిడ జవాబు చెబితే, గోదారమ్మ నవ్వుమొహంతో అసలు విషయం చెప్పింది. ‘‘సీతా... మీ అమ్మగారు నీ పెళ్ళికి ముహూర్తం పెట్టించి వచ్చారు. నాలుగు రోజుల్లోనే సుమా...!’’

‘‘మీ నాన్న ఆ ముందు రోజు వస్తానని నన్ను పంపించారు...’’ అందావిడ సీత వైపు చూస్తూ.

సీత కొంచెంగా తలవాల్చి సిగ్గుగా నవ్వింది.

గోదారమ్మ సీతతో ‘‘అందరికీ టీ పెట్టమ్మా. రామచంద్రని ఇప్పటివరకూ మీ అమ్మగారు చూడనే లేదుగా, కబురు పెట్టమని అంటోంటే, నేను అతనేనని చెప్పలేదు. ఇపుడు రమ్మను... అమ్మకు పరిచయం చేస్తాను...!’’ అంది.

సీత అలాగే నంటూ తలవూపి లోపలకు వెళ్ళింది.

వంటగదిలో టీకి సిద్ధం చేస్తూ ‘‘మా అమ్మ వచ్చింది. అమ్మ మిమ్మల్ని చూడలేదుగా, ఇపుడు చూస్తుందట... వెళ్ళండి.’’ అంది అపుడే అక్కడు వచ్చిన రామచంద్రతో.

‘‘అవును సీతా, నాకో సందేహం. ఇపుడు మీ అమ్మగారు నన్ను చూసి నచ్చలేదని చెబితే, ఏం చేస్తావ్....?’’ సరదాగా అడిగాడతను.

సీత కొంటెగా నవ్వు మొహంతో చూసింది.

ఒక క్షణం ఆలోచించినట్లుగా మొహం పెట్టి ‘‘ఏం ఉందీ, సరేనని పంపించేస్తా...!’’ అని జవాబు చెప్పేసరికి అతను ఆశ్చర్యంగా చూసి ‘‘నాకు అర్థంకాలేదు. పంపించేస్తావా... ఎవరినీ...? ఎక్కడికీ...?’’ అనడిగాడు.

సీత ఫక్కున నవ్వింది.

‘‘ఇంకెవరినీ, మా అమ్మని... పెళ్ళి ఆపటం కుదరదని ఊరికి పంపించేస్తా. పెద్దమ్మని మెప్పించి ఒప్పించిన వ్యక్తిని అమ్మ కాదని అనదు! ఒకవేళ అన్నా కూడా, పెద్దమ్మ అంగీకరించిన వ్యక్తిని వదులుకోవటానికి నేను సిద్ధంగా లేను!’’

అంటూనే ‘‘మీరు మతిమరపులోనో, మైమరపులోనే పడి.. వచ్చిన పని మరిచిపోకండి. కుముదను స్కూలు నుండి తీసుకు వస్తానని చెప్పారిందాక’’ అంది.

రామచంద్ర కూడా నవ్వుతూ ‘‘అవునవును... మీ అమ్మగారిని కలిసాక స్కూలుకు వెళ్ళి కుముదను తీసుకువస్తాలే...!’’ అన్నాడు.

సీత తల్లి తనని పట్టిపట్టి చూస్తుంటే... అతను కొంచెం ఇబ్బంది పడుతూ ‘‘సరేనండీ... నేను వెళ్ళి అమ్మాయిని బడినుండి తీసుకువస్తానూ..’’ అని బయలుదేరాడు.

“రామచంద్రా... అటు నుండి అటే... ఇంటికి వెళ్ళిపోకండి. ఈ పూట ఇక్కడే భోజనాలు చేద్దురుగానీ. పైగా అన్ని విషయాలూ మాట్లాడుకునే పనీ ఉంది కూడాను..” అని హెచ్చరించింది గోదారమ్మ.

అతను అలాగే అన్నట్లుగా తలవూపాడు.

* * *

అందరూ కూర్చుని మాట్లాడుకున్నారు.

సీత తల్లి వీరమ్మ చెప్పిన పద్ధతుల్ని సీత కొట్టిపారేసింది. ఊరందరికీ భోజనాలు లాంటి హంగులేమీ లేకుండా క్లుప్తంగా, గుడిలో దండలు మార్చుకోవటంలాంటి చిన్నపాటి తంతుతో పెళ్ళి ముగించేయటం బావుంటుందని తన అభిప్రాయంగా చెప్పి గోదారమ్మను, రామచంద్రనూ సలహా అడిగింది.

వాళ్ళిద్దరూ కూడా అలాగే చేద్దామని అనటంతో, వీరమ్మ కూడా కొంచెం అసంతృప్తితోనే అయినా అలాగేనంటూ ఆనందంగా అంగీకరించింది.

వాళ్ళిద్దరూ కలిసి కొన్నాళ్ళ తర్వాత తమ వూరుకి వెళ్ళినపుడు అలాంటి వేడుక బంధువులందర్నీ పిలిచి చేసుకోవచ్చునంటూ గోదారమ్మ చెబితే వీరమ్మా అదే సరియైనదనుకుంది.

ఆ మరునాడు ఒక అనుకోని సంఘటన జరిగింది.

రామచంద్ర ఓ వారం రోజులు తన ఆఫీసుకు సెలవు పెట్టాడు. సీత ఏదో పనిమీద బయటకు వెళ్ళింది. ఇంతలో పెరట్లో ఏదో శబ్దం వినబడటంతో వీరమ్మా, గోదారమ్మా బయటకు హడావుడిగా వచ్చారు.

వీరమ్మ అప్రయత్నంగా అక్కడ ఉన్న నేల బావిలోకి తొంగిచూసి నోట మాట రాక గోదారమ్మతో ఏదో చెప్పే ప్రయత్నం చేస్తుంది...గోదారమ్మ కూడా నూతిలోకి చూసి వెంటనే ‘‘రామచంద్రా’’ అంటూ పెద్దగా కేక పెట్టింది. తను తెచ్చిన సరుకులను సర్దుతున్న రామచంద్రవర్మ ఆ కేక విని పరుగున పెరట్లోకి వచ్చాడు.

గోదారమ్మ చేయి చూపించిన వేపుకి చూసి ఆ దిగుడు బావి నీళ్ళల్లో ఉన్న రంగాని గమనించి, మరో ఆలోచన లేకుండా వెంటనే బావిలోకి దూకేసాడు.

అప్పటికి తెప్పరిల్లిన ఆడవాళ్ళిద్దరూ చేదను తాడుతో పట్టుకుని వెంటనే బావిలోకి జారవిడిచారు. అది పట్టుకున్న వర్మ పిల్లాడినీ పొదివి పట్టుకున్నాడు. ఆ బావికి ఉన్న మెట్లు వేపుగా వాళ్ళిద్దరూ కలిసి ఆ చేద తాడులను జరపగానే, అతను రంగాను ఒక మెట్టు మీద కూర్చోబెట్టి, తర్వాత గట్టిగా పట్టుకుని మెట్లెక్కి పైకి వచ్చేసాడు.

అప్పటికి దడదడలాడిన అందరి గుండెలూ స్థిమిత పడ్డాయి.

ఏదో బొమ్మతో ఆడుకుంటూ గెంతుతూ చూసుకోకుండా రంగా ఆ నేల బారున ఉన్న బావిలో పడిపోయాడన్నమాట!

‘తనకీ ఈతరాదని, వాళ్ళిద్దరూ బావిలోకి తాడును జారవిడవటం వల్ల మేలు జరిగిందని’ రామచంద్ర అనగానే పెద్దవాళ్ళిద్దరూ నోరెళ్ళ బెట్టారు. పిల్లాడు నీళ్ళల్లో పడటం చూసి వాడిని కాపాడగలగాలనే అభిప్రాయమే తప్ప ఇంకేమీ ఆలోచన రాలేదని అన్నాడు వర్మ.

పిల్లాడిని చేతులతో ఎత్తుకుని డాక్టరు దగ్గరకు వెళ్ళొస్తానని చెప్పి చకచకా రామచంద్ర వర్మ బయటకు వెళ్ళిపోయాడు.

‘‘అమ్మో... ఎంత గండం గడిచిందీ...!’’ అనుకుంటూ పెద్దవాళ్ళిద్దరూ దేముడికి దండాలు పెట్టుకుంటూ కూర్చున్నారు.

కాసేపటిలోనే వచ్చిన రామచంద్ర డాక్టరు 'ఏం ఫర్వాలేదని చెప్పాడనీ, కొంచెం భయపడ్డాడు కాబట్టి... గోరు వెచ్చని పాలు తాగించి, కాసేపు నిద్రపుచ్చమని' చెప్పాడనీ విన్నాక, వాళ్ళ గుండెలు కుదుటపడ్డాయి.

అంతలోనే తనకి కావల్సినవేవో కొనుక్కుని ఇంటికి వచ్చిన సీత జరిగిందంతా విని నిర్ఘాంతపోయింది.

రంగా దగ్గర వర్మ ఉన్నాడని పెద్దవాళ్ళు చెప్పేసరికి హడావుడిగా లోపలకు పరుగెత్తింది. మంచం మీద పడుకోబోతున్న రంగా, సీతను చూస్తూనే హత్తుకుపోయాడు.

''అమ్మా... నాన్న నన్ను గట్టిగా పట్టుకుని నూతిలోనుండి పైకి తీసుకువచ్చాడు. మళ్ళీ వెంటనే డాక్టరు దగ్గరకూ తీసుకెళ్ళాడు...'' ముద్దు మాటలతో మురిపెంగా చెప్పాడు.

సీత కళ్ళు పెద్దవిచేసి వాడివైపు ఆశ్చర్యంగా చూసింది.

రామచంద్ర వేపు వేలు చూపించి ''వీరిని నాన్న అని పిలవాలని నీకెవరు చెప్పార్రా...?'' అని అడిగింది.

వాడు చిరునవ్వుతో చూస్తూ ''రెండు రోజుల్లో నాకు నాన్న అవుతారని పెద్ద అమ్మమ్మ చెప్పింది... అందుకే ఈ రోజు నుండే అన్నాను.'' అన్నాడు.

సీత పెదవులపైకి చిరునవ్వు వచ్చింది.

''సరే.... నువ్వు కాసేపు పడుకోమ్మా...'' అంటూ దుప్పటి కప్పి పడుకోబెట్టింది.

సీత వంటగదిలోకి వెళ్ళబోతూంటే... రామచంద్ర కూడా వెనకే వచ్చి ''సీతా... ఇద్దరం కలిసి వంట త్వరగా చేసేద్దాం... నాకూ పని చెప్పు...'' అన్నాడు.

సీత అతనివైపు చూసి చెప్పింది ''ఈ వేళ పెద్ద సాహసం చేసి అలిసి పోయారుగా, విశ్రాంతిగా కూర్చోండి...!''

మళ్ళీ అతనితో చిరునవ్వుతో అంది ''నాకు ఈ రోజే మన పెళ్ళి అయినట్టుగా ఆనందంగా ఉంది....!''

''నాకూ.... అలాగే ఉంది...! శివధనుస్సు విరిచి... సీత మనసు గెలిచినట్టుగా గొప్ప ఆనందంగా ఉంది!'' అతనూ చిరునవ్వుతోనే జవాబు చెప్పాడు.

"ఆనందం సరే, 'గొప్ప' అనే పదం ఎందుకో....?"

''సీత మనసు గెలవటం అంటే... మామూలు విషయంగా అనిపించలేదు మరి!''

‘‘అదేమంత గొప్ప అనుకోనవసరంలేదు గానీ, చూశారా.... ఎవరూ చెప్పకుండానే రంగా ఈ రోజే మిమ్మల్ని ‘నాన్న’ అని అనటం మాత్రం నిజంగా గొప్ప సంగతే! చిన్న పిల్లల మనసు గెలవగలగటమే అసలైన విజయం!’’ అంది సీత కళ్ళల్లో ఆనందాన్ని చూపిస్తూ.

రామచంద్ర ఏదో ఆలోచిస్తున్నట్లుగా అన్నాడు ‘‘పెద్దమ్మ గారి ఆలోచన ఇలా ఫలించింది! ఈ వూళ్ళో అందరూ నన్ను ‘వర్మ’ అనే పిలుస్తారా... ఆవిడ మాత్రం నన్ను ‘రామచంద్రా’ అనే అంటారని చెప్పారు. పేర్లూ కలిసాయని అపుడలా అనుకున్నారేమోనని ఇపుడు అనిపిస్తోంది!’’

‘‘అవును... అయివుండొచ్చు. అందుకే, అటువంటి అభిప్రాయం ఏర్పడటంతోనే, మిమ్మల్ని నాకు పరిచయం చేసారేమో....!’’ అంది సీత.

‘‘అయితే సీతా... నాకో సందేహం. పెద్దమ్మగారి మీద నీకున్న గురి వలన ఈ పెళ్ళికి అంగీకరించావా... ఈ వేళ రంగాని కాపాడాననే అభిప్రాయంతో ఇష్టం కలిగి పెళ్ళి అయిపోయిందన్నట్లుగా అనిపించిందా....?’’

రామచంద్ర ప్రశ్నకి సీత తల అడ్డంగా ఊపింది. ‘‘గోదారమ్మగారి పట్ల నాకు గురి ఉన్నమాట నిజమే అయినా, కేవలం ఆ కారణంతో నేనంగీకరించలేదు! నాకు ఇష్టం కలగకపోతే, ఎవరి మాటా వినే ప్రసక్తి లేదు. కాకపోతే, పెద్దమ్మ వలన మీ పరిచయం, ప్రేమించటం, ప్రేమించబడటం అనే అదృష్టం నాకు దక్కిందని అనుకుంటున్నా...’’ నవ్వుతూ రామచంద్ర వైపు చూసింది.

‘‘సీతా... నీ మాటలు వింటోంటే, నాకు జన్మ ధన్యమైపోయిందన్న మైమరపు కలుగుతోంది...!’’ అతని కళ్ళు అరమోడ్పులయ్యాయి.

సీత ఫక్కున నవ్వింది.

“ఇక తన్మయత్వాలు చాలు... వంట సంగతి మరిచిపోతున్నాం. మనమే అయితే ఫర్వాలేదు. కానీ ఇంకా ఇంట్లో పెద్దవాళ్ళూ, పిల్లలూ ఉన్నారు... సాయం చేస్తానన్నారుగా’’ అంటూ కూరగాయలు తీసి అతనికి ఇచ్చింది తరగటానికన్నట్లుగా.

రామచంద్ర కూడా నవ్వు మొహంతో చాకు తీసుకుంటూ... “సరదాగా నీ పాట వింటూ పని చేస్తే ఏ అలసటా ఉండదనిపిస్తోంది, సీతా” అన్నాడు. సీత కూడా ఆనందంగా మెల్లని గొంతుతో తన భావాలనే పాటలా సందర్భానుసారం కూనిరాగం తీసింది.....

“ఈ సీత కలగనలేదు, రాముని సతి కాగలనని ఏనాడూ...

రాముడు అనుకోలేదు, సీతకు పతి కాగలనని ఆనాడు...

ఆనాడు ఎవరూ అనుకోనిదీ...ఈనాడు మనకూ నిజమైనదీ...

ఆ రామాయణం...మన జీవన పారాయణం..." సిగ్గు ముంచుకు రాగా పాట అంతటితో ఆపేసింది సీత.

ఆ పేరడీ పాటకీ...అందులోని భావానికీ పరవశించిపోయాడు రామచంద్ర... "ఆనాటి రాముడి సంగతేమోగానీ...నేను మాత్రం ఈ జన్మలో నీలాంటి అందాల సీతమ్మ నన్ను వరిస్తుందని కలలో కూడా అనుకోలేదు సుమా..." గుసగుసగా అన్నాడు.

"నేనూ అంతే..." అంది సీత ఆరాధనగా.

* * *

ఆరోజే రామచంద్ర నూతి చుట్టూ నాలుగడుగుల గోడ ఏర్పాటు చేసే పని ప్రారంభించాడు. ఆ పని ఆ మరునాటితోనే పూర్తయింది. అనుకున్నట్లుగా గుడిలో సీత తల్లిదండ్రులు, గుడి పూజారి గారి ఆధ్వర్యంలో వాళ్ళ పెళ్ళి జరిగింది. గోదారమ్మ మాత్రం ఇంటి దగ్గరే పిల్లల్ని పెట్టుకుని ఉంటానని గట్టిగా చెప్పేసరికి ఎవరూ కాదనలేకపోయారు. ఊళ్ళోని జనం చాలామందే వచ్చారు. ఎవరూ ప్రత్యేకంగా పిలవకపోయినా, అందరూ తమ ఇంటి శుభకార్యంలా భావించి వచ్చారు. అక్షింతలువేసి ఆశీర్వదించారు.

కొద్దిమంది సీతావాళ్ళతో పాటుగా ఇంటికీ వచ్చారు. పాటలతో, నవ్వులతో సందడి చేసారు.

వాళ్ళందరికీ వీరమ్మగారు వూరు నుండి తెచ్చిన తీపి, కారం పిండి వంటల్ని పేపరు ప్లేట్లలో సర్ది ఇవ్వటం జరిగింది.

ఆ మరునాడు ఉదయం

కాపీ బృందం వాళ్ళు సీతా రామచంద్రల పెళ్ళి సందర్భంగా ఒక చక్కటి పెయింటింగ్ గిఫ్ట్ గా సీత చేతికి ఇచ్చారు.

దానిపైన 'కాఫీదేవత సీతకు కల్యాణం సందర్భంగా కాఫీ బృంద సభ్యుల చిరుకానుక' అని రాసి ఉంది.

సీత దానిని అపురూపంగా అందుకుని ధన్యవాదాలు చెప్పింది వాళ్ళందరికీ. అక్కడే ఉన్న రామచంద్ర సరదాగా నవ్వుతూ "కానుక మీ సీతకే గానీ, నాకేం లేదాండీ?" అనడిగాడు వాళ్ళ వైపు చూస్తూ.

"అదేమిటండీ అలా అంటున్నారూ...? దేవతలాంటి సీత సహచర్యం మీకు లభించాక ఇంకేమి ఇచ్చినా తక్కువే కదండీ..?" అన్నాడు ఆనందరావు చమత్కారంగా. అంగీకరిస్తున్నట్లుగా రామచంద్ర ఆహ్లాదంగా నవ్వాడు.

సీత చిరునవ్వుతో "నన్ను దేవతని చేసి దూరం పెట్టకండి. నేను మీ అందరి లాంటి దాన్నే కదా... మీలో... ఒకమ్మాయిని అంతే!" అంది.

వాళ్ళందరూ కూడా చిరునవ్వుతో తలవూపారు. "అవునమ్మా... మా అందరింటి అమ్మాయివి. ఆ ఆత్మీయతతోనే అంటున్నాం... దేవతలా కనుపించే లక్షణం నీకుందని! ఇది కేవలం మా మాట మాత్రమే కాదు, మీ పెద్దమ్మ గోదారమ్మగారి మాట కూడాను...!" అని వాళ్ళల్లో ఒకరు అనగానే, అందరూ సరదాగా నవ్వుకున్నారు.

అందరూ కుటుంబాలతో వీలునుబట్టి ఒకరోజు అనుకుని వస్తే, వంట కలిసి చేసుకుని ఆరోజంతా సరదాగా గడుపుదామని గోదారమ్మ అంటే... అలాగేనని అంతా ఆనందంగా అంగీకారం తెలిపారు.

అలా సీతా కల్యాణం అతి సాధారణంగా...అత్యంత ఆనందంగా జరిగిపోయింది!

ఆ మరునాడు సీత తల్లిదండ్రులు తమ వూరుకు బయలుదేరి వెళ్ళిపోయారు.

రామచంద్ర తన ఇల్లు ఖాళీచేసి కుముదతో, సామానుతో సీతావాళ్ళింటికి తన మకాం మార్చటం తప్ప మార్పులేమీ లేవు. అపుడప్పుడూ రామచంద్ర కుముదతో వచ్చి ఉండటం జరుగుతూండేదే కనుక కొత్తగా ఏమీ జరగనట్లే ఉంది అందరికీ.

* * *